క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ ప్రారంభం

కంచికచర్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్‌ను ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం సోమవారం ప్రారంభించారు. బస్టాండ్‌లో వసతులపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని శుభ్రం చేయడం లేదని మహిళా ప్రయాణికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన వివరించారు. కొన్నేళ్లుగా బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో సైకిల్ స్టాండ్‌ను తిరిగి ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపరిండింటెంట్(ట్రాఫిక్) శ్రీదేవి, బస్టాండ్ సూపర్‌వైజర్ సామ్యేలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్లు, రికార్డులు అప్పగింత



జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల, ధర్మవరప్పాడుతండా, అన్నవరం, వేదాద్రి గ్రామాలతోపాటు పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ వద్ద ఉన్న ఫోన్లు, డివైజ్‌లు, రికార్డులను సోమవారం ఆయా సచివాలయాల సిబ్బందికి అందజేశారు. వలంటీర్లు వారి విధుల్లో ఉండకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో ఆయా రికార్డులను వారు సచివాలయాల్లో అప్పగించారు.

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీ హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై సోమవారం సరస్వతీ హోమం చేశారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మల్లేశ్వరస్వామివారి ఆలయం సమీపంలోని యాగశాలలో అర్చకులు యాగాన్ని జరిపించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని, వార్షిక పరీక్షలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని కాంక్షిస్తూ ప్రతి నెలా మూలా నక్షత్రం రోజున అమ్మవారి సన్నిధిలో హోమం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులు హోమంలో పాల్గొనగా, పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు జరిపించారు.

ఆకట్టుకున్న ధార్మిక ఉపన్యాసం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో డాక్టర్ అనంతలక్ష్మి ధార్మిక ఉపన్యాసం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద భవానీ సేవాధారులు వివిధ పుష్పాలతో శ్రీచక్రాన్ని తీర్చిదిద్దారు. ఆలయ ఈవో కె.ఎస్. రామరావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధార్మిక ఉపన్యాసం ఇవ్వగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఈవో రామరావు మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఆధ్యాత్మికతను పెంచే కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అనంతలక్ష్మి, భవానీ సేవాధారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు పాల్గొన్నారు.

కారు ఢీ.. యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారు ఢీకొని యువకుడు గాయపడిన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం కొత్తవంతెన ప్రాంతానికి చెందిన అమరా వెంకటేష్ తన బైక్‌పై వెళ్తుండగా, వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. వెంకటేష్ మణికట్టుకు, తలకు గాయం కావడంతో వెంటనే 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఇకొనసాగిస్తున్నారు. పోతిన వీరనారాయణ జ్ఞాపకార్థం సోమవారం బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు.

పండుటాకుల ఆందోళన

- టీడీపీ నిర్వాకంతో అందని పింఛన్లు..
- 58 నెలలుగా ఒకటో తేదీనే ఠంచన్‌గా అందిన పింఛన్
- ఎన్నికలను సాకుగా చూపి వలంటీర్లను అడ్డుకున్న టీడీపీ
- ఆందోళనలో పింఛన్‌దారులు





కదలలేని స్థితిలో మంచానికే పరిమితమైన పింఛన్‌దారులు

కంచికచర్ల: ప్రతినెలా ఒకటీ తేదీన అందే పింఛన్ ఈసారి అందకపోవడంపై పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో వలంటీర్‌లు పింఛన్ పంపిణీ చేయకుండా చూడాలంటూ ప్రతిపక్ష టీడీపీకి మద్దతుదారుగా ఉన్న కొందరు వ్యక్తులు కోర్టులకు వెళ్లి మరీ ఆదేశాలు జారీచేయించడంతో వలంటీర్లు పింఛన్లు పంపిణీకి దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో గత 58నెలలుగా ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే సామాజిక ఫింఛన్ పొందుతున్న పింఛన్‌దారులకు ఈసారి పింఛన్ అందలేదు. ప్రతిపక్ష టీడీపీ కుట్రల కారణంగా తమకు పింఛన్ అందకుండా పోతోందని వృద్ధులు, వికలాంగులు, వితంతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడు పింఛన్ సొమ్ము ఇంటికి వచ్చి ఎవరు ఇస్తారని అవ్వాతాతలు ప్రశ్నిస్తున్నారు. తమను ఇబ్బందులకు గురిచేయడానికే ఈపని చేశారంటూ టీడీపీ వ్యవహారశైలిపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. గతంలోనూ వలంటీర్ల సేవలపై టీడీపీ కుట్రపూరితంగానే వ్యవహరిస్తూ, వారిపై అనేక అభాండాలు వేసిన వైనాన్ని పింఛన్‌దారులు గుర్తుచేస్తున్నారు.

వలంటీర్ల తొలగింపు బాధాకరం..



మా సొంత మనవడిలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి వలంటీర్ల ప్రతినెలా ఒకటోతేదీన పొద్దు పొడవక ముందు పింఛన్ డబ్బులు ఇంటికి వచ్చేలా చేశాడు. అటువంటి వలంటీర్లను తొలగించేందుకు టీడీపీ పార్టీ కుట్ర పన్నడం నాలాంటి వృద్ధులకు అన్యాయం చేయడమే.

– మందా బుచ్చయ్య, కొత్తపేట

పింఛన్ రాకపోతే ఎలా బతకాలి..



వలంటీర్లను తొలగిస్తే రెండునెలలు ఏ విధంగా బతకాలి. ఎన్నికలు కోడ్‌ను అడ్డుపెట్టుకుని మాలాంటి పేదలకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా టీడీపీ, దాని అనుబంధ వ్యకులు దుర్మార్గపు చర్యలకు పాల్పడటం తగదు. వలంటీర్లను లేకుండా చేసి మాటోటి వాళ్లకు పింఛన్ డబ్బులు రాకుండా అడ్డు పడే వాళ్లను ఆ దేవుడు కూడా క్షమించడు.

– బొక్కా సంతోషం కొత్తపేట

పొద్దునే పింఛన్ ఇచ్చేవారు..



ప్రతినెలా మొదటి తారీఖు రోజునే తెల్లవారేసరికి వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ సొమ్ము మంచంలో ఉన్న నన్ను లేపి ఇచ్చేవాడు. కొందరి స్వార్థపూరిత కుట్రల కారణంగా ..నడవలేనిస్థితిలో ఉన్న నాలాంటి వాళ్లు పింఛన్ కోసం ఇప్పుడు మళ్లీ ఇబ్బందులు పడాల్సి దుస్థితి వచ్చింది.

– తంగిరాల మార్తమ్మ, నవాబుపేట

అక్కసుతోనే అడ్డుకుంటున్నారు..



వలంటీర్లు ప్రతినెలా ఠంచనుగా పింఛన్ ఇస్తుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే తన అనుయాయుల ద్వారా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది.

– గుంటి దేవకరుణమ్మ, జమ్మవరం

వలంటీర్ కోసం ఆశగా చూస్తున్నా..



ప్రతినెలా ఒకటో తేదీనాడు సూర్యోదయానికి ముందే ఇంటికివచ్చి మా వలంటీర్ పింఛన్ అందజేసేవాడు. ఈరోజు ఇంకా రాలేదు. వస్తాడేమోనని ఎదురు చూస్తున్నాను. పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

– కాలవ సావిత్రమ్మ, అనాసాగరం.

నా అవిటితనాన్ని గుర్తుచేశారు..



నాకు కళ్లు కనిపించవు. అవిటిదానిని. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని ఇన్నాళ్లు నాకు అవిటితనం కనిపించలేదు. ఏది కావాలన్నా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు వలంటీర్ల సేవలను అడ్డుకుని పింఛన్ రాకుండా చేసి నా అవటితనం గుర్తుచేశారు.

– కస్తాల సుశీలమ్మ, చందర్లపాడు

పేదలపై చంద్రబాబుకు కక్ష తగదు..



నిరుపేదలు, పండుటాకులపై చంద్రబాబు కక్ష కట్టారు. పేదలకు వలంటీర్‌లు అందిస్తున్న పింఛన్ల పంపిణీ తదితర సేవలను నిలిపివేసేందుకు చంద్రబాబు ఈ ఎన్నికలను సాకుగా చూపడం బాధాకరం. చంద్రబాబు ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి.

– నాగేశ్వరరావు, చందర్లపాడు

పాతరోజులు గుర్తుకొచ్చాయి..



చంద్రబాబు హయంలో పింఛన్ కోసం పంచాయతీ ఆఫీసు వద్ద పడిగాపులు పడాల్సివచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ప్రతినెలా ఒకటోతేదీ తెల్లవారుజామున ఇంటివద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారు. వలంటీర్లను అడ్డుకుని మళ్లీ పాతరోజులు గుర్తుకుతెచ్చారు.

– మన్నెపల్లి, ప్రాసినమ్మ, పెంట్యాలవారిగూడెం

కరోనాలో కూడా చక్కగా ఇచ్చారు..



కరోనా సమయంలో కూడా వలంటీర్ పింఛన్ అందజేసి వెళ్లాడు. ఇప్పటివరకు ప్రతినెలా ఒకటోతేదీన ఇబ్బంది లేకుండా పింఛన్ అందుతుండగా, ఈసారి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. వలంటీర్ల సేవలను అడ్డుకుని మాలాంటి ఇబ్బందికి గురిచేయడం తగదు.

– గోపు వెంకట సుబ్రహ్మణ్యం, నందిగామ

ఇది దుర్మార్గ చర్య..



వలంటీర్లు పింఛన్ ఇస్తుండటం మాకు ఎంతో మేలు చేస్తోంది. కాని ఈ నెల నుంచి ఆ పరిస్థితి లేదు. చంద్రబాబు తొలి నుంచి వలంటీర్ల సేవలను వ్యతిరేకిస్తున్నారు. ఇప్పుడు పింఛన్లు అందించకుండా అడ్డుకున్నారు. ఇది దుర్మార్గ చర్య. పేదలకు మేలు జరగకుండా అడ్డుకోవడం ధర్మం కాదు.

– యాదాల అన్నమ్మ, జమ్మవరం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేశా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే నందిగామలో ఈ ఐదేళ్ల పాలన సాగిందని ఎమ్మెల్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు రైతుపేట డౌన్ తదితర ప్రాంతాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు రానున్న ఎన్నికలలో పూర్తి మద్దతు పలికి తనను గెలిపించాలని కోరారు. ఎనిమిదో వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికారు.

పురపాలక సంఘంగా పదోన్నతి..

ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామను మరింత అభివృద్ధి చేయాలనే తపనతో పనిచేస్తున్నామన్నారు. నందిగామ మున్సిపాలిటీ స్థాయికి తగిన ఆదాయం, జనాభా కలిగినప్పటికీ గతపాలకుల హయాంలో నగరపంచాయతీగానే మిగిలిపోయిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక నందిగామను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించినట్లు గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్‌ను ఆమోదింపజేసుకుని అందుకనుగుణంగా పట్టణ సర్వతోముఖాభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులోభాగంగానే డ్రైన్‌లు, సిమెంట్ రోడ్లు నిర్మించామని, రానున్న కాలంలో నందిగామ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సైతం రూపొందిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానన్నారు. ఒకసారి ఇచ్చిన అవకాశంతో ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని సాకారం చేశామని గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతల మాదిరిగా మరొకరిపై ఆధారపడకుండా స్వీయనిర్ణయాలతో నందిగామను గతానికి భిన్నంగా అభివృద్ధి చేసి తామేంటో నిరూపించుకున్నామన్నారు. మరోసారి అవకాశిచ్చి అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా మార్చాలని ప్రజలను కోరారు. ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వార్డు కన్వీనర్ గుడివాడ సాంబశివరావు, నాయకులు మన్నెం దాసు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఓర్సు జ్వాలా, దొంతిమాల చంద్రశేఖర్, మాడుగుల మనోహర్, బొంతు సతీష్‌రెడ్డి, పోతురాజు, షేక్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు : డీసీపీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని విజయవాడ రూరల్ డీసీపీ కె శ్రీనివాసరావు హెచ్చరించారు. గ్రామంలో గత రెండు మూడురోజులుగా జరుగుతున్న ఘర్షణ, ఉద్రిక్తత వాతావరణానికి సంబంధించి ఆదివారం రాత్రి స్థానిక బీసీ కాలనీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా చర్యలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. ఎవరో ఒకరిద్దరి చర్యల కారణంగా అందరికీ ఇబ్బందులు వస్తాయన్నారు. అందరూ సంయమనంతో ఉండి ప్రశాంత వాతావరణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకిరామ్, పి.చంద్రశేఖర్, ఎస్ఐ పి రాంబాబు పాల్గొన్నారు. గ్రామంలో ప్రత్యేక బలగాలతో పాటు పికెట్ నిర్వహిస్తున్నారు.

ఇంటింటికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. కంచికచర్ల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కంచికచర్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు కోట్లాది రూపాయల నిధులతో రోడ్లు, మంచినీరు, ఇతర మౌలికవసతులు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. 33కేవీ హై టెన్షన్ విద్యుత్ వైర్ల కారణంగా కంచికచర్లలో ఆరుగురు మృత్యువాతపడినప్పటికీ గత టీడీపీ పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి విద్యుత్ వైర్ల తొలగింపునకు నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించారన్నారు. కంచికచర్ల మండలంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ ప్రతినిధులపై ఉందన్నారు. టీడీపీ హయాంలో నిరాదరణకు గురైన కంచికచర్ల మండలానికి వందలాది కోట్ల నిధులను మంజూరు చేయించి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విజయానికి అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, పార్టీ కంచికచర్ల మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, మాడుగుల మధుబాబు, గుగులోతు ఇందిర, బండారుపల్లి నాగపుష్పలీల, నాయకులు లగడపాటి నాగేశ్వరరావు, అమర్లపూడి యోహాను, వేమా శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, ఉప్పు స్వామి, కావాటి రాంబాబు, దాసరి రాజా, షేక్ రజీమ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఆర్ఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఆర్వో వెంకటేశ్వర్లు, హాజరైన సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్వోలు

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో బీఎల్వోలు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్‌వోలతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా అవకాశం కల్పించిన హోం ఓటింగ్‌పై బీఎల్వోలకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. 85 ఏళ్ల వయస్సు దాటిన వారు, దివ్యాంగులు(పీడబ్ల్యుడీ) ఎవరైతే ఓటు వేయడానికి రాలేని పరిస్థితుల్లో ఉన్నారో వాళ్లకు మాత్రమే అప్లికేషన్లు ఇచ్చి సకాలంలో ధరఖాస్తులు కలెక్ట్ చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్, 40శాతం పైన వికలత్వం ఉన్నట్లుగా ఏదైనా ప్రభుత్వ వైద్యులచే ధ్రువీకరణపత్రం ఉంటే ఇంటినుంచి ఓటువేసే అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటి వరకు హోం ఓటింగ్‌కు పట్టణంతోపాటు పేట మండలంలో 108 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోల తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పేట తహసీల్దార్, ఏఈఆర్వో శేషగిరి, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల తహసీల్దార్లు వి.అమ్మాజీ, కె.సూర్యారావు, పేట మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, పేట ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

48మంది వలంటీర్లు రాజీనామా



పరిటాలలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

పరిటాల(కంచికచర్ల): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల సేవలను అడ్డుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలో సిటిజెన్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడంపై మనస్తాపం చెంది కంచికచర్ల మండలం పరిటాల గ్రామ సచివాయలం -1,2లలో విధులు నిర్వర్తిస్తున్న 48మంది వలంటీర్లు సోమవారం వారి ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా లేఖలను ఎంపీడీఓ ఏ దీప్తికి అందజేశారు. ఐదేళ్లుగా వలంటీర్లుగా పనిచేస్తూ పేదలకు సేవలందిస్తున్న తమపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగులో కొందరు వ్యక్తులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వైనాన్ని ప్రజలు గమనించాలని వారు కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): ఎన్నికల నేపథ్యంలో అన్ని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నామని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, నగదు, మాదకద్రవ్యాలు అక్రమ రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నామని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ మహాలక్ష్మణుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సేవకు ప్రతిరూపం నాగమల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సేవకు ప్రతిరూపం కోరంగి నాగమల్లీశ్వరి అని ఆమె చేస్తున్న సేవలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని తోటివారికి సాయం చేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ అన్నారు. హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సోమవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. సత్కారగ్రహీత నాగమల్లీశ్వరి మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్‌తో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు షఫీవుల్లా, హేమంతరావు, రాము పాల్గొన్నారు.

సత్తాచాటిన సీఎస్ఈ విద్యార్థులు



బహుమతి పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

మైలవరం: ఇన్నోవేషన్ ఫెయిర్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. మార్చి 27, 28 తేదీలలో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించిందన్నారు. తమ కళాశాలకు చెందిన సీఎస్ఈ విభాగం నుంచి ఐడియా ఎన్‌హాన్సింగ్ మొబైల్ సెక్యూరిటీ విత్ యాన్ ఆటోమేటెడ్ సిమ్ స్లాట్ ఎజెక్షన్ సిస్టమ్ అండ్ ఆథెంటికేషన్ మెకానిజమ్ అనే అంశంపై ఆఖరి సంవత్సరం విద్యార్థి యు.అర్జున్, తృతీయ సంవత్సరం విద్యార్థినులు బీ గ్రేసీ, ఎల్.మనీషా పాల్గొని మొదటి బహుమతి పొందారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎమ్. శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డి. వీరయ్య, కోఆర్డినేటర్లు, మెంటార్స్ డాక్టర్ ఏ.నరేంద్రబాబు, డాక్టర్ డీ వెంకట సుబ్బయ్య తదితరులు అభినందించారు.

టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో మంచి అవకాశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాలిటెక్నిక్ కోచింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పేద విద్యార్థుల సౌకర్యార్థం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ప్రతీ ఏటా ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. 10 పూర్తయిన తర్వాత అనేక అవకాశాలు ఉన్నాయని వాటిలో ముఖ్యంగా పాలిటెక్నిక్ చదివితే వెంటనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. పాలీసెట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి గౌరవాన్ని ఇనుమడింపజేయాలి



జగ్గయ్యపేట అర్బన్: బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపప్రధాని ఎల్‌కె.అద్వానీకి భారతరత్న పురస్కారం అందజేసే సమయంలో ప్రధాని నరేంద్రమోదీ తీరు గర్హనీయమని వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి లాహోరి బద్దూనాయక్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపతీముర్ము నిలుచుని అద్వానీకి పురస్కారం అందజేస్తుండగా, అదేసమయంలో రాష్ట్రపతి పక్కన ఉన్నారనే గౌరవం కూడా లేకుండా ప్రధాని నరేంద్రమోదీ కూర్చుని ఉండటం రాష్ట్రపతిని అగౌరవపరచమేనన్నారు. ఒక గిరిజన మహిళ అయినందునే రాష్ట్రపతికి ప్రధానమంత్రి మోదీ తగిన గౌరవం ఇవ్వడంలేదని విమర్శించారు. గతంలో నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవ సమయంలో కూడా రాష్ట్రపతి ద్రౌపతీముర్ముకు ఆహ్వానం ఇవ్వకపోవడాన్ని గుర్తుచేశారు. అత్యున్నతమైన ఆమె పదవిని అవమానపరచడం తగదన్నారు. ఈ సంఘటనను తాము ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, తద్వారా భారత రాష్ట్రపతి పదవికి అగౌరవం ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని పేర్కొన్నారు. హైకోర్టు మాజీ ఏజీపీ, న్యాయవాది మోత్రపు అమృతనాగభూషణం, పేట మండల గిరిజన నాయకుడు భూక్యా పాండూనాయక్ పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పెనమవారం అరెస్టు చేశారు. లంబాడీపేటకు చెందిన జటావత్ భాను అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 10 మద్యం సీసాలు, రూ.100 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.